



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com
మంగళవారం | 17-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 196 పేజీలు: 4 వెల: రూ.7



# పోలీసులకు.. సవాల్

* ఒకే రోజు.. ఎన్నెన్ని దారుణాలు
* ఉపాధ్యాయురాలిపై రాళ్లతో దాడి
* వివాహిత పుస్తెలతాడు లాగేసిన చైన్‌స్నాచర్
* మహిళ మర్డర్
* సాధువు హత్య
* బ్యాంకు ఆవరణలో నగదు చోరీ
* పోలీసులకు సవాల్‌గా మారిన ఘటనలు
* ఉలిక్కిపడిన సిక్కోలు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 16 (వార్త):** సిక్కోలు జిల్లా చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సోమవారం ఒక్కరోజే అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. దుండగులు పోలీసులకు సవాల్ విసిరినట్టుగానే ఉద్దానంలో ఇద్దరు మహిళలపై చైన్‌స్నాచింగ్ బ్యాచ్ దాడికి పాల్పడ్డారు. ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో ఓ మహిళ హత్య, ఇచ్ఛాపురంలో మరో హత్య, ఉద్దానంలోని చైన్‌స్నాచింగ్, సారవకోట బ్యాంకు ఆవరణలో దోపిడీ జరగ్గా, పలాసలో ఓ టీడీపీ నేతను లేపేసేందుకు బిహారి బ్యాచ్ దిగడం, వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలన్నీ జిల్లా పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ దారుణ ఘటనలతో సిక్కోలు ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

## మహిళ మర్డర్..



**ఆమదాలవలస:** గాజులకొల్లివలస గ్రామం సమీపంలోని సంగమేశ్వర కొండ వద్ద వంశధార నిర్వాసితుల కాలనీలో ఆదివారం రాత్రి వివాహిత దారుణంగా హత్యకు గురైంది. సంగమయ్య కొండ సమీపంలో తులగాం గ్రామస్తులకు ప్రభుత్వం కాలనీ ఇల్లు నిర్మాణం చేపట్టింది. ఈ కాలనీలో ఉంటున్న ఉంటున్న పొందర కులానికి చెందిన దామోదర పద్మ (35) హత్యకు గురైంది. అదే కాలనీకి చెందిన సొండి సురేష్ ప్రేమగా ఉంటు ప్రాణం తీశాడు. ఆదివారం రాత్రి మృతురాలు ఇంటికి వెళ్లి ఆమెతో వాగ్వాదానికి దిగినట్టు తెలిసింది. ఇద్దరి మధ్య కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. సురేష్ ఆదివారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో బాకుతో పద్మ ను (పదునైన కత్తి) గుండుపై బలంగా పొడిచి హత్య చేసి పరారయ్యాడు. తమ కళ్ల ఎదుట తల్లి రక్తపు మడుగులో పడిపోవడం చూసిన కుమార్తెలు ఆందోళనతో కేకలు పెట్టడంతో కాలనీవాసులు వచ్చి చూశారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనం వచ్చేసరికి ఆమె మృతి చెందింది. పెద్ద కుమార్తె కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.వెంకటేష్ కేసు నమోదు చేయగా, సీఐ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

## బ్యాంకు ఆవరణలో నగదు చోరీ

**సారవకోట:** బొంతు గ్రామానికి చెందిన తంగుడు సురేష్ బొంతు రూ.1.4 లక్షలకు పైగా నగదును ఏపీజీవీబీలో జమచేయడానికి సోమవారం ఉదయం పది గంటలకు వచ్చాడు. బ్యాంకు ముఖద్వారానికి సమీపంలో కుమ్మరిగుంట, మహాశింగి సీఎస్పీలు చలపతిరావు, రత్నాల ఆదినారాయణ కూర్చొని ఉండటంతో వారికి సమీపంలో నగదు సంచిని ఉంచి, దానిపై ఖాతాదారులకు సంబంధించిన పుస్తకం, టోపీని పెట్టి ఇప్పుడే వచ్చేస్తానని చెప్పి సారవకోటలోని మందుల దుకాణానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి సంచిపై ఉన్న పుస్తకం, టోపీ కిందపడి ఉండటం గుర్తించారు. సంచి లోపల చూసేసరికి నగదు లేకపోవడంతో ఆందోళన చెంది, విషయాన్ని బ్రాంచి మేనేజర్ గోపాలకృష్ణకు చెప్పారు. అనంతరం సారవకోట పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని తెలియజేయడంతో ఎస్ఐ అనీల్‌కుమార్, సిబ్బందితో హుటాహుటిన చేరుకుని బ్యాంక్‌లోని సీసీ ఫుటేజీతో పాటు పలు చోట్ల సీసీ ఫుటేజీలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## సాధువు హత్య



**ఇచ్ఛాపురం:** లొద్దపుట్టి సమీపంలోని ధనరాజు తులసమ్మ గుడి వద్ద కాషాయ దుస్తులు ధరించిన సాధువు హత్యకు గురయ్యారు. ఆలయం వద్ద బిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న ఈయన గుడి సమీపంలోని ఓ దుకాణం వద్ద నిద్రిస్తుండగా బండరాళ్లతో కొట్టి హతమార్చారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్సై చిన్నంనాయుడు మృతదేహాన్ని పరిశీలించి ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మమ్మల్ని కూడా కొట్టాడు

### ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వాహకుడిపై యువతుల ఫిర్యాదు

**శ్రీకాకుళం క్రైం:** ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వాహకుడు తమను కూడా వేధించాడని పలువురు యువతులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. అబ్బాయిలనే కాదని, తమను కూడా కొట్టేవాడని వాపోయారు. ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి లక్షలు వసూలు చేసేవాడని, అమ్మాయిల వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవాడని, ఆ ఫుటేజీలతో బ్లాక్ మెయిల్ చేశాడని చెబుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2019లో రమణపై జలుమూరు స్టేషన్‌లో 18 మంది విద్యార్థులను మోసం చేసినట్లు కేసు కూడా నమోదైందని నేవీ మాజీ ఉద్యోగి ఒకరు తెలిపారు.





## ఉద్దానంలో చైన్‌స్నాచింగ్..

**కవిటి:** భైరిపురానికి చెందిన బి.భారతి (52) పాఠశాలకు సోమవారం నడుచుకుంటూ వెళుతోంది. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వస్తూ ఆమె మెడలో పుస్తెలతాడు తెంపి పారిపోతుండగా బాధితురాలు పట్టుకుంది. దీంతో ఆ వ్యక్తి ఆమె తల వెనుక భాగంలో రాయితో కొట్టాడు. ఉపాధ్యాయురాలు కేకలు వేసుకుంటూ పాఠశాల వైపు పరుగు తీయగా ఆ వ్యక్తి పరారయ్యాడు. పి.తిరుపతిరావు అనే వ్యక్తి సాయంతో బొర్రపుట్టుగ గ్రామానికి చేరుకున్నారు. అనంతరం గాయాలపాలైన భారతిని కవిటి సీహెచ్‌సీకి, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పలాసకు తరలించారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కవిటి ఆసుపత్రికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. కవిటి ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూటీపై వెళ్తుండగా..




**ఇచ్ఛాపురం:** బెల్లుపడ నీలాపు వీధికి చెందిన లండ నీలవేణి కుమార్తె సంధ్యతో కలిసి స్కూటీపై ఇచ్ఛాపురం నుంచి కవిటి వైపు వెళుతోంది. గుర్తు తెలియని వ్యక్తి ద్వివాహనంపై వెనుక నుండి వచ్చి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపి పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చిన్నంనాయుడు తెలిపారు.

## పోలీసుల అదుపులో 11 మంది


నాగరాజు

**పలాస:** పలాసలో ఓ టీడీపీ నేత బడ్డ నాగరాజు హత్యకు కుట్ర పన్నిన 11 మందిని పోలీసులు రహస్యంగా విచారణ చేస్తున్నారు. వీరిలో ముగ్గురు బిహార్ గ్యాంగ్‌తో పాటు ఒక మాజీ ఆర్మీజవాను, కాంట్రాక్టు లెక్చరర్, కొందరు వైసీపీ నేతలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి పాల్పడింది ఎవరు, వెనుక నుంచి చేయిస్తుంది ఎవరు అన్న దానిపై పోలీసు అధికారులు ఒక బృందంగా ఏర్పడి విచారణ చేపడుతున్నారు.


కూర్మాపు ధర్మారావు
అంపోలు శ్రీనివాసరావు

జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం 17 డిసెంబర్ 2024

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## ప్రవీణ్‌నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలి

**ఎచ్చెర్ల, డిసెంబర్ 16(వార్త)**: ప్రవీణ్‌నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆర్జీయూకేటీ డైరె క్టర్ ప్రొఫెసర్ బాలాజీ అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రవీణ్‌నాయక్ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రవీణ్‌నాయక్ కుటుంబ సభ్యులకు ఆ భగ వంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ సభలో పరిపాలన అధికారి ముని రామ కృష్ణ, డీన్ మోహన్‌కృష్ణచౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని సంతాపం తెలిపారు.

# అర్జీలను వేగంగా పరిష్కరించండి

### -కలెక్టర్ స్వప్నిల్ దినకర్



**శ్రీకాకుళం, డిసెంబర్ 16(వార్త)**: మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీలను వేగవంతంగా పరిష్క రించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అధి కారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమం ఆయన అధ్యక్ష తన జరిగింది.

ఈసందర్భంగా ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిని సంబంధిత అధి కారులకు రిఫర్ చేశారు. ప్రజలు వివిధ సమస్యలపై కలెక్టర్‌కు 49 అర్జీలను సమర్పించారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో అప్పారావు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్‌రాజు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీపీవో కె.భారతీసౌజన్య, జిల్లా జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వీ ప్రసాదరావు, కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అనురాధ, డీఎస్వో సూర్యప్రకాష్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ, డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు, డీసీహెచ్‌యస్ డా.కళ్యాణ్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు

**- ఇమ్మానుయేల్ కంప్యూటర్ సంస్థ డైరెక్టర్ విజయకృష్ణ**

**- ఆమదాలవలస, సరుబుజ్జిలి, నరసన్నపేట ఒకేషనల్ విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో శిక్షణ**

**శ్రీకాకుళం, డిసెంబర్ 16(వార్త)**: కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు సా ధ్యమవుతాయని ఆమదాలవలసలోని ఇమ్మానుయేల్ కంప్యూటర్ సంస్థ అధి నేత పి.విజయకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఈ సంస్థ లో ఆమదాలవలస, సరుబుజ్జిలి, నరస న్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల లకు చెందిన ఒకేషనల్ విద్యార్థులకు ఆన్‌దిజాబ్ ట్రైనింగ్‌లో భాగంగా సోమ వారం ప్రత్యేక తరగతులు నిర్వహించా రు. భవిష్యత్ కంప్యూటర్ రంగానిదే న న్నారు. కంప్యూటర్ విద్య అభ్యసించిన విద్యార్థులకు భవిష్యత్ బంగారు బాట అవుతుందన్నారు. ఎక్సెల్, వర్డ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఈమెయిల్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగా హన కల్పించి, కంప్యూటర్ ప్రాక్టికల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాప కులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి, కూన హరిప్రసాద్ పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు న్యాయం



**శ్రీకాకుళం, డిసెంబర్ 16(వార్త)**: ఎస్సీ వర్గీకరణపై అధ్యయనానికి ఏపీ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమి షన్ చైర్మన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రా సోమవారం జిల్లా లో పర్యటించారు. వర్గీకరణపై ప్రజాభి ప్రాయాలను తెలుసుకోవడానికి జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయనను టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సవలాపు రపు వెంకటరమణ మాదిగ కలిసి వర్గీకరణ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎస్సీల్లోని ఉప కులాలకు సమా న న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ జరిగితే వీరికి న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.

ఆయన వెంట మాదిగ నేతలు ఉన్నారు.




## వర్మీ కంపోస్టు కొనుగోలు చేసిన ఎస్పీ

**శ్రీకాకుళం, డిసెంబర్ 16(వార్త)**: మీకోసం కార్యక్రమం నిర్వహించిన జడ్పీ కార్యాలయ ఆవరణలో వర్మీ కంపోస్టు స్టాల్‌ను సోమవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆ స్టాల్‌ను పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వర్మీ కంపోస్టును కొనుగోలు చేశారు. అర్జీదారులు కూడా ఈ స్టాల్‌లో వర్మీ కంపోస్టు కొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



**మందస, డిసెంబర్ 16(వార్త):** విద్యార్థినులు ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకోవా లని పలాస శౌర్య హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. కుంటికోటలోగల కె.నారాయణ హైస్కూల్లో 'ఆడపిల్లల ఆరోగ్యం-పరిశుభ్రత' అనే అంశంపై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పరిశుభ్రంగా ఉండడం ప్రతీ విద్యార్థిని అలవర్చుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లేకపోతే వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. పౌష్టికాహా రం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు, నియమాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు పలు సందేహాలను అడిగి, నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రోహిణీశంకర్, డైరెక్టర్ బుద్ధసూర్య. అరవింద్ నారాయణన్, సిబ్బంది పాల్గొన్నారు.

## డీ పట్టాల సమస్య తీర్చండి



**టెక్కలి, డిసెంబర్ 16(వార్త)**: మేఘవరం పంచాయతీ గిరిజన గ్రామాల్లో నెల కొన్న డీ పట్టాల సమస్యను పరిష్కరించాలని బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జన్ని పరమేశ్వరరావు సోమవారం టెక్కలి తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయంలో ఇచ్చిన డీ పట్టా భూములకు రైతు భరోసా వస్తున్నప్పటికీ వన్ బీ పైన డిజిటల్ సంతకం రావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చాలామంది రైతులు పంట రుణాలు తీసుకోవడానికి అనర్హులవుతున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. దీనిని తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో బీజేపీ మోర్చా జిల్లా కార్యదర్శి రంకిడి నీలయ్య, టీడీపీ సీనియర్ నాయ కులు కెల్లి శ్రీరాములు, జన్ని ధర్మారావు, యాళ్ల మల్లేసు, చతివాడ లక్ష్మయ్య, పొట్నూరు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యం

**మందస, డిసెంబర్ 16(వార్త)**: పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యమని ఎంపీ డీవో పి.సూర్యనారాయణ అన్నారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, సచివాల య సిబ్బందికి సోమవారం ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. అసమానతలు, వాతావరణ మార్పు, జీవవైవిధ్య నష్టం అనేవి పురోగతికి ముప్పు అన్నారు. పేదరిక నిర్మూలన, ఆహార భద్రతను కల్పించి, పోషకత్వాన్ని మెరుగుపర్చడం, ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాలు పెంపు లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దాన య్య, ఈవోపీఆర్డీ కె.జయప్రకాశ్, మండల స్థాయి అధికారులు, టీవోటీలు సోమే ష్, జీవన్, కూర్మారావు, మోహనరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com


## కందిరీగల దాడిలో పలువురికి గాయాలు

**కోటబొమ్మాళి, డిసెంబర్ 16(వార్త)**: కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోగల బంజీరుపేట గ్రామానికి చెందిన పలువురు రైతులపై సోమవారం కందిరీగలు దాడి చేశాయి. రైతులు పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలోగల తోట వద్ద కందిరీగలు వారిపై దాడి చేశాయి. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లి చికిత్సను అందించారు. రెండు రోజుల క్రితం తోటకు వెళ్లిన గొర్రెల, మేకల కాపర్లపై కూడా దాడి చేశాయని, సోమవారం పొలం పనులు ముగించుకొని ఆదరబాదరగా ఇంటికి వస్తున్న సమయంలో కందిరీగలు తమపై దాడి చేశాయని గ్రామానికి చెందిన రైతు శిమ్మ తవిటి రాజు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం కలుగలేదని, అందరూ క్షేమంగానే ఉన్నారని ఆయన చెప్పారు.



## పలు కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

**వంగర, డిసెంబర్ 16(వార్త)**: వంగర మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. మగ్గూరు గ్రామంలో మృతిచెందిన పొలిరెడ్డి కృష్ణన్నాయుడు, రెడ్డి భాస్కరరావు కుటుంబసభ్యులను, శివ్వాం గ్రామంలో మరణించిన ఏనుగుతల వేమినాయుడు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి, తన సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, జడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు, శివ్వాం సర్పంచ్ ప్రతినిధి బొక్కెల సత్యంనాయుడు, మగ్గూరు సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, ఆర్ఎంపీ వైద్యులు ఉగిరి ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

## ఉద్యమ ధ్రువతార సుబ్బారావుపాణిగ్రాహి



**మందస, డిసెంబర్ 16(వార్త)**: విప్లవ ఉద్యమ ధ్రువతార సుబ్బారావు పాణిగ్రాహి అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయం వద్ద సోమవారం పాణగ్రాహి వర్ధంతి సభ కరపత్రం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి, పంచాది నిర్మల, గొరకల అంకమ్మ, తెలికుల సరస్వతి, చెల్లూరు ఉమారావు, రమేష్ చంద్రసాహుల 55వ వర్ధంతి సభ రట్టి గ్రామంలో ఈ నెల 22న నిర్వహిస్తున్నామన్నారు. పాణిగ్రాహి గొప్ప సాంస్కృతిక యోధుడని కొనియాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, వంకల పాపయ్య, భార్గవి ఉన్నారు.

## ఆహారాన్ని వృథా చేయరాదు



**శ్రీకాకుళం, డిసెంబర్ 16(వార్త)**:ఆహారాన్ని వృథా చేయకుంటే అన్నపూర్ణాదేవి నిత్యం ధాన్యరాసుల్ని కురిపిస్తుందని,కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ అన్నారు. స్థానిక విశాఖ బీకాలనీ షిరిడీసాయిబాబా మందిరంలో సోమవారం నిస్సహాయులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలు, ఇతరత్రా కార్యక్రమాల్లో మిగిలిన ఆహార పదార్థాలు బయట పారేయకుండా, నిరు పేదలలకు అన్నదానం చేయాలని సూచించారు.కార్యక్రమంలో దాతలు వినయ్, ఉర్లాం శివతేజ, కొంక్యాన శివశంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ వర్గీకరణతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం

**వంగర, డిసెంబర్ 16(వార్త)**: ఎస్సీ వర్గీకరణతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమని దళిత బహుజన జేఏసీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి గణపతి తెలిపారు. వంగరలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులాల మధ్య చిచ్చుపెట్టి రాజ్యాధికారానికి దూరం చేయడానికి కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కులగణన చేపట్టి, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని దళిత సేన కార్యదర్శి ఎం.గణపతిరావు డిమాండ్ చేశారు.



# ఎస్పీ గ్రీవెన్స్‌కు 62 వినతులు

**-చట్ట ప్రకారం పూర్తి స్థాయిలో పరిష్కరించాలి**

**-పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు**



**శ్రీకాకుళం, డిసెంబర్ 16(వార్త)**: చట్ట పరిధిలో విచారణ జరిపి ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ప్రజల నుంచి 62 ఫిర్యాదులు స్వీకరించారు. వారితో ముఖాముఖిగా మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. నడవలేని వృద్ధులు, వికలాంగుల వద్దకు ఎస్పీనే వెళ్లి వారి వినతులు తీసుకుని పరిష్కారిస్తామని భరోసా కల్పించారు.

# ముందుచూపు లేకుంటే భవిష్యత్ గందరగోళమే



**పోలాకి, డిసెంబర్ 16(వార్త)**: కలుషిత ఆహారం, వాతావరణంపై ముందుచూపు లేకుంటే భవిష్యత్ గందరగోళమే అని మండల పరిషత్ ముఖ్య సలహాదారుడు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ ఆవరణలో వనరుల అభివృద్ధి, ఇతరత్రా అంశాలపై జరిగిన శిక్షణలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో 80% కూడా మరుగుదొడ్లు వాడకపోవడం దురదృష్టకరమన్నారు. జలజీవన మిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన ప్రకృతిని కాపాడుకునేందుకు తగిన చర్యలు చేపట్టే దిశగా ప్రయత్నాలు చేపట్టాలని కోరారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి గరిమెళ్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రకృతిలో ప్రమాదకరమైన మార్పులు కనిపిస్తున్నాయని, చర్యలు చేపట్టకపోతే భవిష్యత్‌లో కారకులమవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని కోరారు. ఇదిలా ఉంటే ఈ శిక్షణ కార్యక్రమానికి 15 పంచాయతీల నుంచి ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సినప్పటికీ గుల్లవానిపేట సర్పంచ్ వారాది మోహనరావు తప్ప అందరూ ప్రజా ప్రతినిధులు డుమ్మా కొట్టారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ విస్తరణ అధికారి నల్లి రవికుమార్, వ్యవసాయ అధికారి చిరంజీవి, పరిషత్ వ్యవహారాల అధికారి సూర్యప్రకాశరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి వై.మోహనరావు, పశువైద్యశాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**కొత్తూరు,డిసెంబరు16(వార్త)**: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం కొత్తూరు మండలం విద్యాశాఖ అధికారి సి.హెచ్. గోవిందరావును కలిసి శానిటేషన్ వర్కర్ల సమస్యలపై ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు గత ఆరు నెలలు వేతనాలు సరిగా అందక చాల అవస్థలు పడుతూ కుటుంబ పోషణ కోసం అప్పులు చేసుకుని బ్రతుకుతున్నారని చెప్పారు.కావున వారి యొక్క జీతాలను తక్షణమే పడేటట్లు చర్యలు తీసుకోవాలని అలాగే వారికి గ్లౌజ్లు, యూనిఫామ్లు ఇప్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు లక్ష్మీ, వెంకటమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఎస్‌డిజిపై శిక్షణ



**కొత్తూరు,డిసెంబరు16 (వార్త)**:కొత్తూరు మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ నీరజ అధ్యక్షతన ఎల్.ఎస్.డి.జిలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల సర్పంచులు, ఉన్నతాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది హాజరయ్యారు.

## 22 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా!

**-మంచినీటి పథకం పైపుల లీకుతో ఇక్కట్లు**



**వంగర, డిసెంబర్ 16(వార్త)**: వంగర మండలంలోని మెట్ట మగ్గూరు గ్రామం కొండ వద్ద ఉన్న మంచినీటి పథకం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ పథకం ప్రధాన పైపు లైన్లు లీకు కావడమే ఇందుకు కారణం. మగ్గూరు వద్ద గల మంచినీటి పథ కం నుంచి వంగర వైపుగా అనేక గ్రా మాలకు వెళ్తున్న ప్రధాన పైపు లైనుకు ఎం.సీతారాంపురం వద్ద ప్రధాన రోడ్డు కింద లీకు కావడంతో ఈ మండలంలో 18 గ్రామాలకు, రేగిడి మండలం ఆరు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో వంగర, రేగిడి మండలాలకు చెందిన 22 గ్రామాల ప్రజలు మంచి నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపు లైనుకు వెం టనే మరమ్మతులు చేపట్టి చర్యలు తీసు కోవాలని కోరారు. ఇలా ఎప్పటికప్పుడు లీకులు ఏర్పడకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 16 (వార్త):** టీ షాపులలో ఇకపై ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడొద్దని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వ్యాపారులకు సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నటువంటి టీ షాప్‌ల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇకపై షాపుల్లో పేపర్ కప్స్ బదులుగా గ్లాస్ లేదా స్టీల్ కప్స్ ఉపయోగించాలన్నారు.



# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

### -ఎంపీ కలిశెట్టి



**వంగర, డిసెంబర్ 16(వార్త):** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వంగర మండలం కొత్తవలస గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు, జాతీయ రైతునేస్తం అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావు.. సోమవారం ఆయనకు నల్ల (బ్లాక్ రైస్)బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలిశెట్టి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతుల పొలంలో పనులు ఉపాధి హామీలో అనుసంధానమయ్యేలా, కూలి లభించేలా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రైతు పెంకి గౌరీశ్వరరావు మాట్లాడుతూ రసాయన ఎరువులతో భూమి నిస్సారమై, మానవాళి అనారోగ్యాల పాలవుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రకృతి వ్యవసాయం అవసరమన్నారు. అనంతరం ఆయనను ఎంపీ.. సత్కరించారు.

కార్యక్రమంలో పారిశ్రామికవేత్త లోలుగు మదన్, పెంకి చైతన్య కుమార్, చిన్నమ్మడు, అరుణకుమారి, ఉరిటి శశి, శ్రీను, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీ గ్రామసభ రసాభాస

**-ఏపీవో నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపణ**

**-ఎంపీడీవో, ఏపీవో సభకు రావాలని డిమాండ్**

**-సమాచారం లేకుండా గ్రామసభ ఎలా ఏర్పాటు చేస్తారని నిలదీత**



**పోలాకి, డిసెంబర్ 16(వార్త):** ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఏడాదిగా ప్రశ్నిస్తున్నా.. సమాధానం చెప్పే అధికారులు లేరని, అందుకే గ్రామసభను రద్దు చేయాలని దండు లక్ష్మీపురం పంచాయతీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పంచాయతీలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభ రసాభాసగా ముగిసింది. డీఆర్పీ ఎల్. మాధవిలత ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నివేదికను చదువుతుండగా లబ్ధిదారులు ప్రశ్నించారు. ఈ సభకు మండల అధికారులు హాజరుకావాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంపై లోపాలు వినే అధికారులే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ముగ్గురు ప్రమేయంతో గ్రామసభ ఎట్లా ఏర్పాటు చేస్తారని మండిపడ్డారు. సర్పంచ్ తమ్మినేని వెంకటరత్నం తనకు సమాచారం లేదని చెప్పి బహిష్కరించారు.

మాజీ సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి అన్నాజీరావు మాట్లాడుతూ గ్రామసభ జరిపినట్లయితే తప్పనిసరిగా మండల అధికారులు రావాలని క్షేత్ర సహాయకులు శ్రీనివాసరావుకు చెప్పినట్లు తెలిపారు. అవకతవకలను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఇంతలో గ్రామసభకు చేరుకున్న స్టేట్ రిసోర్స్‌పర్సన్ పున్నపునాయుడు మాట్లాడుతూ ఉపాధి పనులు జరిగిన ప్రదేశంలో సమయపాలన పాటించాలని సూచించారు. చేసిన పనిబట్టే వేత నం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం రూ.300లు వరకు వేతనం పెంచినట్లు చెప్పారు. క్షేత్ర సహాయకులు లేరని, పంచాయతీ కార్యదర్శి సాంకేతిక సహాయకులు పనుల నిర్వహణలో బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు శ్రీనివాసరావు, సురేష్, మాజీ సర్పంచ్ డోల ప్రసాదరావు, బీజేపీ ప్రతినిధి రామారావు, వీఎస్ఏ హైమావతి, పలువురు వేతనదారులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వద్దు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 16(వార్త):** ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జిల్లా జైభీమ్ గౌరవ అధ్యక్షుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గ మాల పోరాట సమితి అధ్యక్షుడు దేవరాజు, ప్రధాన కార్యదర్శి డొప్ప వెంకటరావు, వినతిపత్రాన్ని అందించారు. ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో జైభీమ్ సోంపేట అధ్యక్షుడు డిస్క ఈశ్వరరావు, కంచిలి మండల గౌరవ అధ్యక్షుడు బాబూరావు, దూసి నారాయణమూర్తి పాల్గొన్నారు.

# పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



**మందస, డిసెంబర్ 16(వార్త):** డబారిసింగి, కుడుమసాయి, గోపాలసాయి, కుమ్మరకుటియా, కొయిటా సాయి తదితర మారుమూల గిరిజన గ్రామాలకు సంబంధించి పీఎం-జన్‌మన్ పథకం కింద పాఠశాల మంజూరైంది. దీంతో జన సేన పార్టీ పలాస సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం స్థల పరిశీలన చేశారు. అధికారులు స్థలాన్ని కూడా ఎంపిక చేశారని, స్థానిక గిరిజనులతో కలిసి, పాఠశాల నిర్మాణంపై చర్చించా మని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దువ్వాడ వంశీ కృష్ణచౌదరి, కోన కృష్ణారావు, నందిగాం ధర్మారావు, అర్జీ తులసీరావు, డీకే రామారావు, బమ్మిడి విద్యాసాగర్, జోగారావు పాల్గొన్నారు.

## నీటి సంఘం సభ్యులకు బగ్గు అభినందనలు



**పోలాకి, డిసెంబర్ 16 (వార్త):** ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన నీటి సంఘ సభ్యులను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అభినందించారు. సోమవారం మబగాం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో యారబాటి అప్పారావు, పార్లమెంటరీ సెక్రటరీ పూతి రమణ, కోమర్తి మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం, ముద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 17 అక్రమ మద్యం సీసాల సీజ్

**కొత్తూరు, డిసెంబర్ 16 (వార్త):** నివగాం గ్రామంలోని పలు బెల్ట్ షాపు లపై కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ సోమవారం దాడులు నిర్వహించారు. సుమారుగా పదిహేడు మద్యం సీసాల ను సీజ్ చేశారు. ఆ గ్రామానికి చెందిన గ్రామంలో నల్లాన హరిశ్చంద్రరావు ను అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి ఇంతకుముందు కూడా ఇటువంటి కేసులో ముద్దాయిగా ఉన్నందున ఆయ నను రిమాండ్‌కి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.



## రట్టి లింగరాజుకు సన్మానం




**మందస, డిసెంబర్ 16(వార్త):** తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజుకు సన్మానం జరిగింది. మందసకు చెందిన లింగరాజు సునాముది సిస్టం-1 అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయనను పలాస నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి సన్మానించారు. పార్టీకి లింగరాజు చేస్తున్న సేవలను కొనియాడారు. కష్టపడిన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించిందని, ఈ పదవితో మరింత బాధ్యత తనపై పెరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య కూడా ఉన్నారు.


## యువకుడి ఆత్మహత్య



**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్16 (వార్త):** శ్రీకాకుళం లెప్రసీ కాలనీ సమీపంలో రామమందిరం వీధిలో నివసిస్తున్న పట్నాన శంకర్(23) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలంగా ఓ మహిళను ప్రేమించి ఆమెతోనే నివాసముంటున్నాడు. ఏమైందో ఏమోగాని శంకర్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందడాన్ని గమనించిన ఆమె చుట్టుపక్కల వారిని పిలిచి ఆస్పత్రికి తరలించింది. శంకర్ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఒకటో పట్టణ ఎస్ఐ బి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీసీటీఏ ఏపీ రాష్ట్ర అకడమిక్ సెక్రటరీగా పైడితల్లి





**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 16 (వార్త):** ఏపీ డిగ్రీ కళాశాల ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ)రాష్ట్ర అకడమిక్ సెక్రటరీగా డాక్టర్ డి.పైడితల్లి, జోనల్ అధ్యక్షులుగా డా.ఎస్ ఢిల్లీశ్వరరావులు ఎంపికయ్యారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ సివిఆర్ డిగ్రీ కళాశాల వేదికగా జరిగిన 37వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంం అనంతరం ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఎకడమిక్ సెక్రటరీగా తొగరాం డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డా డి పైడితల్లి, జోనల్ ప్రెసిడెంట్‌గా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డా ఎస్ ఢిల్లీశ్వరరావు ఎన్నికైనట్లు జిల్లా సెక్రటరీ డా.ఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పైడితల్లి యూనివర్సిటీ సెక్రటరీగాను, జోనల్ ప్రెసిడెంట్ గాను వరుసగా పని చేస్తూ ఇప్పుడు రాష్ట్రస్థాయి కార్యవర్గంలో ఎన్నికయ్యారని చెప్పారు. ఢిల్లీశ్వరరావు జిల్లా సెక్రటరీగా పనిచేస్తూ ఇప్పుడు జోనల్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారని తెలిపారు. వీరిని జిల్లా అధ్యక్షులు డా కె చక్రపతి, జిల్లా, కళాశాల స్థాయి వివిధ కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546